
నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 30



# నా కథలే నా స్థిర చరాస్తులు

**- ద్విభాష్యం రాజేశ్వరరావు**

జీవితాన్ని ప్రేమించినంత గొప్పగానే ప్రకృతిని ప్రేమించే రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు. పచ్చదనం పస తెలిసిన రచయిత. హరితవనం అందాల్ని ఆస్వాదించి అందరికీ పంచాలన్న తాపత్రయంతో పాటు, శిథిలమైపోతున్న మానవ సంబంధాల పట్ల ఆవేదన కలిగిన రచయిత. కాపాడుకోవాల్సిన విలువల్ని విస్మరిస్తున్నందుకు మథనపడుతున్న మానవత్వమున్న రచయిత. మూడు దశాబ్దాల క్రితం వందలాది కథలతోనూ, పదుల సంఖ్యలో నవలల తోను సాహితీ ప్రపంచంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న రచయిత. పర్యావరణంపై 'పారిశ్రామిక భద్రత – పర్యావరణ బాధ్యత' పుస్తకాన్ని రాసి ప్రధాని పి.వి.నరసింహారావుకు స్వయంగా అందచేసి అభినందనలు అందుకున్న 'ద్విభాష్యం'తో ఇంటర్వ్యూ....

### బాల్యం జమీందారు కొడుకులా...

1946 సెప్టెంబర్ 5 విశాఖ జిల్లా యలమంచిలిలో పుట్టాను. నాన్నగారు వేంకట సూర్యనారాయణమూర్తి, అమ్మ నర్సాంబ. ఎగువ మధ్యతరగతి కుటుంబమే అయినా మా నాన్నగారు ఆ ఊళ్లో చింతలూరు డాక్టరుగా వ్యవహరించడం వల్ల, నాన్నగారికి ఊళ్లో ఉన్న ఆదరణవల్ల నా బాల్యం జమీందారి కుటుంబంలో పిల్లాడిలాగే గడిచింది. హైస్కూల్లో తెలుగు మాస్టారు యామిజాల నారాయణ మూర్తి గారి ప్రోత్సాహంతో తెలుగుమీద మక్కువ పెరిగింది. మా పెదనాన్న గారు ద్విభాష్యం వేంకట రావుగారు అప్పట్లో గద్వాల మహారాణి ఆస్థానంలో 'ఆస్థాన కవి వైద్యుని'గా ఉండే వారు. తిరుపతి వేంకట కవుల్లో ఒకరైన చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రిగారు కూడా మాకు బంధువే!



శ్రీమతితో...

### రెండో కథలో ఒళ్లు హూనం

1960 ప్రాంతంలో ఒక చిన్నపిల్లల కథ రాసి 'బాల' పత్రికకు పంపిస్తే, పంపిన రెండో నెల సంచికలోనే అచ్చయింది. ఆ పత్రిక పట్టుకుని ఊరంతా ఆనందంతో తిరిగి అడిగిన వాళ్లకూ, అడగని వాళ్లకు అందరికీ చూపించాను. కొందరు మెచ్చుకున్నారు. కొందరు "చదువు మానేసి ఈ వెధవ్వేషాలేమిటి?" అని మందలించారు. 1961లో ఒక సాంఘిక కథ రాసి 'చిత్రగుప్త' పత్రికకు పంపాను. అది పక్షపత్రిక. పత్రిక లోపల బొమ్మలుండేవి కావు. కానీ, అట్టమీద ఓ కథలోని బొమ్మవేసి 'ముఖచిత్రం' కథానిక పేరుతో ఆ కథ ప్రచురించేవారు. వెనక అట్టమీద 'బలం ఉంటేనే బ్రతుకు' అనే నినాదంతో 'జీవన్‌టోన్' ప్రకటన ఉండేది. కథ పంపిన రెండు నెలలకు అచ్చయింది. ఓ రోజు విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్ మీద ఉండగా 'నువ్వెంత అమాయకుడివోయ్ కృష్ణా' అంటూ ఆమె అతని మీదకు వంగింది... తరువాత కథ కావాలంటే 'చిత్రగుప్త' కొని చదవండి, అంటూ ఓ కుర్రాడు పుస్తకాలు అమ్ముతూ తిరుగుతున్నాడు. అది నా కథలోని వాక్యం లాగే అనిపించి వెంటనే పుస్తకం కొన్నాను. నా కథ 'అసమర్థుడు' అందులో ముఖచిత్రం కథానికగా అచ్చయింది. అట్టమీద బొమ్మలో మాత్రం కథలో లేని శృంగారాన్ని కళ్లకు కట్టించారు. ఇంటికొచ్చాక ఆ పత్రికను దాచేశాను గాని, నాలుగురోజుల తరువాత నాన్నగారి కంట పడింది. ఆయన కథ చదవలేదు గాని ముఖచిత్రంలో కథకు గల అనుబంధాన్ని అ(పా)ర్థం చేసుకుని "బూతు కథలు రాస్తున్నావా ఆఖరికి?" అంటూ చావకొట్టేరు. అచ్చయిన నా రెండో కథ అలా నాకు ఒళ్లు హూనం చేయించింది.

## నచ్చినవి

| | |
|---|---|
| పదాలు | : అన్నమయ్య సంకీర్తనలు |
| వ్యాసాలు | : పానుగంటి వారి సాక్షి వ్యాసాలు |
| కథ | : పొగలేని నిప్పు (బుచ్చిబాబు) |
| నవల | : అల్పజీవి (రావిశాస్త్రి) |
| కవిత | : అమృతం కురిసిన రాత్రి (తిలక్) |
| సినిమా | : మాయాబజార్ |
| నటుడు | : యస్వీ రంగారావు |
| నటి | : సావిత్రి |
| గాయకులు | : ఘంటసాల, బాలు |
| గాయని | : లతామంగేష్కర్ |
| పాట | : మౌనంగానే ఎదగమనీ (నా ఆటోగ్రాఫ్... స్వీట్ మెమొరీస్) |
| బంధువు | : వరుల కోదండరామ్ (మా చిన బావగారు) |
| స్నేహితుడు | : సింగనపల్లి బలరాం |
| వంట | : మా శ్రీమతి చేతివంట ఏదయినా సరే! |
| వ్యాపకం | : పుస్తకాలు చదవటం, పర్యావరణ పరిరక్షణ గురించి కృషి చేయడం |

### లిఖిత మాసపత్రిక నడిపాం

'వసంత' అనే పేరుతో లిఖిత మాసపత్రికను రెండు సంవత్సరాల పాటు నడిపాం. ఆ రోజుల్లో డిటెక్టివ్ నవలలు పాకెట్ బుక్‌సైజులో వచ్చేవి. కొమ్మూరి సాంబశివరావు రచనలను అతి ఇష్టంగా చదివేవాడిని. నాకు పుస్తక పఠనంమీద ఆసక్తి పెంచినవి ఆ నవలలే. అయితే వాటిని రహస్యంగా స్కూల్ బుక్స్ మధ్య పెట్టుకుని చదివేవాణ్ణి. ఎందుకంటే, ఇంట్లో తెలిస్తే వీపు వాచిపోయేది. ఆ రోజుల్లోనే మా ఊళ్లో మంచి గ్రంథాలయం ఉండేది. లైబ్రేరియన్ సుబ్రహ్మణ్యం గారు నా చేత విశ్వనాథ నవలలు, శ్రీశ్రీ మహాప్రస్థానం ఇతర గ్రంథాలు చదివించే వారు. మంచి పుస్తకాలు చదివించి నాలో ఆలోచనా శక్తిని పెంచింది ఆయనే!



కుటుంబసభ్యులతో...

### కథ రాసి స్థిరాస్తి పొందాను

రెండో కథ అచ్చయిన తరువాత నాన్నగారి దేహశుద్ధితో రెండేళ్ల వరకూ కథల జోలికి పోలేదు. 1963లో రెండు కథలు రాసి ఆంధ్రప్రభ పత్రికకు పంపితే ప్రచురించారు. ఆ రెండు కథల్లోనూ స్త్రీ పాత్రలు లేకుండా జాగ్రత్త పడ్డాను. అవి చదివి నాన్న ఆనందించేరు. "బాగున్నాయిరా! అబ్బాయ్...!" అంటూ మెచ్చు కుంటూనే

''ముందు చదువు సంగతి అఘోరించు'' అంటూ హెచ్చరించారు. అప్పటి నుంచి చదువు, కథలు రెండూ అఘోరించడం మొదలు పెట్టాను.

1969 ఆంధ్రప్రభ దీపావళి కథల పోటీలో నా కథ 'నీలిమంట'కు ద్వితీయ బహుమతి 1750 రూపాయలు వచ్చింది. అప్పటికి నేను చేస్తున్న ఉద్యోగంలో నా నెల జీతం 320 రూపాయలే. అంటే ఒకేసారి ఆరు నెలల జీతం బోనస్ వచ్చినట్లన్నమాట. ఆ చెక్కు మార్చి నాన్నకు డబ్బు ఇస్తుంటే, ''నాకెందుకురా? నువ్వే తీసుకుని విశాఖపట్నంలో ఏదైనా ఇంటి స్థలం కొనుక్కో'' అని సలహా ఇచ్చారు. ఆనాడు గజం మూడు రూపాయల వంతున కొన్న 350 గజాల ఇంటి స్థలాన్ని ఈనాటికీ కాపాడుకుంటూ వస్తున్నాను. మిగిలిన డబ్బుతో ఒక డబుల్‌కాట్ కూడా కొన్నాను. నా జీవితంలో పెద్ద స్థిరాస్తి. చరాస్తి నేను రాసిన కథ ద్వారా లభించింది. ఇది నాకు ఎప్పటికీ గర్వకారణం. 1964 మొదలుకొని 1983 వరకు పుంఖానుపుంఖాలుగా కథలు రాసాను.

**అవార్డులూ... రివార్డులూ**

1983లో 'ఏ వెలుగులకీ ప్రస్థానం' అనే నవలకు 'యువ'లో చక్రపాణి అవార్డు వచ్చింది. ఆ తరువాత చక్రవర్తి, ఆంధ్రభూమి పత్రికల కథల పోటీల్లో బహుమతులు ఎన్నో వచ్చాయి. నేనురాసిన నవలల మీద 'మిసే హెల్గా' అనే ఆవిడ, కథల మీద ఇంకో మహిళ రీసెర్చ్ చేసి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పి.హెచ్.డి.లు పొందారు.



కీ.శే. పీవీతో...

సుమారు నాలుగు వందలకు పైగా కథలు, పదిహేను వరకు నవలలు. పది భద్రతా నాటికలు, ఆరు సాంఘిక నాటకాలు రాసాను. ప్రముఖ కంపెనీలకు 40కి పైగా వాణిజ్య ప్రకటనలు అందించాను. 30కి పైగా కథలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. రేడియోలో చాలావరకు రచనలు ప్రసార మయ్యాయి.

**ఊహలు కాదు... వాస్తవాలే నా కథా వస్తువులు**

నేను చూడనిది, నా అనుభవంలోకి రానిది లేదా నా పరిసరాల్లోని వ్యక్తుల అనుభవం లోకి రాని విషయాలు నేను రాయలేదు. అనుభవంలోకి వచ్చిన విషయాలను విచక్షణతో విభజించి సంఘానికి మేలు జరిగే వాటినే కథా వస్తువులుగా స్వీకరించాను. మానవతా విలువలు క్రమేణా తరిగిపోతున్నాయి. మారుతున్న జీవనశైలి తరుముతూ పరుగులు పెట్టిస్తోంది. నా రచనలు అన్నీ శిథిలమైపోతున్న మానవ సంబంధాల మీదా, కాపాడుకోవాల్సిన విలువల మీద, పదిలపరుచుకోవాల్సిన నైతిక స్థైర్యం మీద, ప్రకృతి మీద రాశాను.

**ఇతర పుస్తకాల ప్రభావం**

ఖచ్చితంగా ఉంది. ఒక మంచి కథ, ఒక సంస్కారయుతమైన ఆలోచన, జీవితంలో ఎదగడానికి ఉపయోగపడే ఆత్మీయ వాక్యం... వీటి ప్రభావం జీవితం మీద తప్పకుండా ఉంటుంది. డేల్‌కార్నీ (గీ) రాసిన పుస్తకాలు పదే పదే చదవడం ద్వారా నా ఆలోచనా సరళి, నా ప్రవర్తన, నా భావ ప్రకటనా విధానం... అన్నీ మార్చుకోగలిగాను. మంచి పుస్తకాల ప్రభావం నెమ్మదిగా అయినా మనిషి మీద పడుతుంది.

**ట్రావెల్ గ్రాంటుతో పర్యటన**

1989లో కేంద్ర సాహిత్య అకాడెమి వారి ట్రావెల్ గ్రాంట్‌తో కర్ణాటక రాష్ట్రంలో పర్యటించి చాలామంది కన్నడ రచయితలను కలిసాను. ప్రముఖ నాట్యాచారుడు, పర్యావరణవేత్త, జ్ఞానపీఠ్ అవార్డ్ గ్రహీత శివరామ కారంత్‌ను బెంగుళూరులో కలిసాను. సుమారు 80 సంవత్సరాల వయసులో 'యక్ష గానాలు' ప్రదర్శింప చేయడానికి ఆయన 'బ్రెజిల్' వెళుతున్నారు. విమానం రద్దయి ప్రయాణం వాయిదా పడడంతో ఆ రోజంతా ఆయనతో గడిపే అదృష్టం దొరికింది. సంభాషణల్లో సాహిత్య విషయాలతో పాటు పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన అనర్గళంగా చెప్పారు. రాబోయే తరాలకు మంచి వాతావరణాన్ని అందించే బాధ్యత రచయితలపై కూడా ఉందన్నారు. ''విశాఖపట్నంలోని మీ రచయితలందరూ ఎందుకు కృషి చేయకూడదు? ఆలోచించండి'' అన్నారు.

ఆయన సూచనలతో 1990లో 'పర్యావరణ పరిరక్షణ సమితి' ఏర్పాటు చేశాం. గౌరవాధ్యక్షులుగా శివరామకారంత్ వ్యవహరించారు. చాలా కార్యక్రమాలు చేపట్టాం. నా కథల్లో ఎక్కడో ఓ చోట పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఇమిడి ఉంటుంది. ఈ నేపథ్యంలో నేను పనిచేస్తున్న కోరమండల్ ఫెర్టిలైజర్స్ యాజమాన్యం నన్ను ఎన్విరాన్‌మెంట్ సెల్‌కు మార్చింది. పదవీ విరమణ వరకూ వృత్తిలో కూడా పర్యావరణ బాధ్యతను నిర్వహిస్తూ వచ్చాను. అభిరుచి, ఉద్యోగం ఒకటే కావడం నాకు లభించిన వరం.

**విదేశీ పర్యటన**

1987లో మా 'విశాఖ సాహితి' అధ్యక్షుడు గణపతి రాజు అచ్యుతరామరాజుతో కలిసి మూడు వారాల పాటు రష్యాలో పర్యటించే అవకాశం కలిగింది. లెనిన్ గ్రాడ్, కేవ్, సోచి, మాస్కో, తాష్కెంట్ మొదలైన ప్రాంతాలన్నీ తిరిగాం. ప్రముఖ ఒరియా రచయిత్రి ప్రతిభారాయ్‌తో పరిచయం ఆ పర్యటనలోనే కలిగింది. మాస్కో మ్యూజియంలో గురజాడ అప్పారావు గురించిన వివరాలు చూసి పులకరించిపోయాను.

**తీరని కోరిక**

'ఆధునిక కవిత్వానికి ఆద్యుడు అన్నమయ్య' అనే అంశం మీద తెలుగులో డాక్టరేట్ చేయాలనే కోరిక ఇంకా తీరలేదు. ఎం.ఎ ఫైనల్‌లో సంస్కృతం పేపరు అప్పట్లో పూర్తి చేయలేక పోయాను. చేయగలనేమో ప్రయత్నించాలి.

**ఇప్పుడొస్తున్న కథల గురించి**

మంచి కథలే వస్తున్నాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో సాంకేతిక విలువలు పెరిగాయి. టెక్నాలజీ ఆధారంగా జరుగుతున్న మోసాల మీద, మారుతున్న జీవితాల మీద చదివించే కథలే వస్తున్నాయి. ఏ కథలు నిలబడతాయన్నది కాలమే నిర్ణయిస్తుంది.

**-మేడా మస్తాన్‌రెడ్డి**

**నాకు నచ్చిన నా కథ**

# కిటికీ

**- ద్విభాష్యం రాజేశ్వరరావు**

**చదువుతున్న నవలను పరుపుమీద పడేశాను.**
**బద్ధకంగా రెండు నిమిషాలు ఇటూ అటూ దొర్లేను.**
**శరీరం కింద ఫోమ్ పరుపు మెత్తగా నలుగుతోంది.**
**దిండులో కొంతసేపు ముఖం దాచుకున్నాను.**
**వింత పరిమళం కమ్మేసింది!**
**నేను వాడే బ్రిల్ క్రీం, ఆఫ్టర్ షేవ్‌లోషన్, చార్లీ స్ప్రే; ఇవికాక సమీర ముఖానికి దట్టంగా పట్టించుకునే మేక్స్ ఫేక్టర్, వాల్లదలో రాత్రి నలిగి పోయిన మల్లెపువ్వుల పరిమళం; ఇవన్నీ కలిపిన వింత సువాసన!!**



హాయిని గొలిపే సుగంధం!!

కళ్ళు మూసుకుని రెండు నిమిషాలు అలాగే వుండిపోయాను.

''గుడ్‌మార్నింగ్''

చెవిలో గుసగుసలాడుతున్నట్లుగా – మెల్లగా సమీర కంఠస్వరం, నా చెవికి అతి సమీపంగా!! దిండులో నుండి ముఖం బయటకు లాగి! బద్ధకంగా కళ్లు విప్పి ఆమె వంక చూస్తూ అన్నాను.

''గుడ్ మార్నింగ్.. టైమెంతయింది?''

''ఆరున్నర! ఈవేళ ఆదివారం కదా!... అందు కని తొందరగా లేపలేదు... ఇంకాస్సేపు రెస్టు తీసు కోండి!''

బెడ్‌మీద నా ప్రక్కలో కూర్చుంటూ, నా జుత్తు లోనికి ఆమె వేళ్లు పోనిచ్చి సుతారంగా రాస్తు అంది సమీర.

''నేను నిద్రలేచి చాలా సేపయింది'' ఆవలిస్తూ అన్నాను.

ఆశ్చర్యంగా నావంక చూసింది సమీర.

''అవును... రాత్రి సగం చదువుతూ వదిలేసిన పుస్తకం ఇంతవరకూ చదివేను...'' అన్నాను.

''చెప్పరేం మరి? .... కాఫీ తెస్తానుండండి... డైనింగు టేబిలు దగ్గరకు వస్తారా? ఇక్కడకు తెమ్మం టారా?'' అంటూ అడిగింది.

''ఇక్కడికి తెస్తే బాగుంటుంది''

సమీర మెల్లగా లేచి, హంసలా వయ్యారంగా కదుల్తూ గదిలోంచి వెళ్ళిపోయింది.

నేను మెల్లగా మంచం మీద నుండి లేచాను.

నైటు బల్బు ఆర్పేశాను.

గదిలో చీకటి పరుచుకుంది!

కిటికీ దగ్గరకు నడిచి సుతారంగా ''వెనీషియల్ బ్లైండ్స్''కు కట్టి వున్న తాడు లాగేను.

పూతరేకు మడతల్లా వున్న మడతలు తమా షాగా విచ్చుకున్నాయి.

గదిలోకి వెలుతురు చొచ్చుకుని వచ్చింది.

అవతల ప్రకృతిలో అప్పుడే నీరెండ పరుచుకుంటోంది. ఇంటిచుట్టూ ఆవరణ నిండా నిండిపోయిన చెట్లు, అడవిలో మానుల్లా పెరిగి పోయాయి. వేప చెట్లు నాలుగు, వాటి మానులకు వేరు తెలియని క్రీపర్ అల్లుకుపోయింది. గేటుకు అటూఇటూ కాపలా దారుల్లా నిలబడిన అశోక వృక్షాలు!

ప్రహరీగోడకు ఆనుకుని ఈ చివర నుండి ఆ చివర వరకూ దట్టంగా పరుచుకున్న బోగన్‌విల్లా పొదలు.

బలిసిన గున్నమామిడి చెట్టు.

ఇవన్నీ కలిసి అవతలి ఎండను కిటికీ గుండా ఇంటిలోకి రానివ్వకుండా చేస్తున్నాయి.

కిటికీకి అడ్డంగా వున్న వెనీషియల్ లీవ్స్‌లో నుండి అవతలకు చూస్తే, ఆ దృశ్యం చాలా తమాషాగా కనబడుతోంది.

దూరంగా కనబడే మేడమీద అమర్చిన టి.వి. ఆంటెన్నాపై ఏదోపేరు తెలియని పక్షి వాలి విలాసంగా తోక వూపుతోంది.

ఆ బంగళా వెనుక బీచ్‌రోడ్!

కాస్త అవతలగా అనంతంగా పరుచుకున్న సముద్రం! దిక్చక్రం దగ్గర రెండు ఓడలు మసగ్గా కన్పిస్తున్నాయి.

స్టీప్ వాటర్స్‌లో మరో రెండు ఓడలు లంగరు దింపుకుని నిరీక్షిస్తున్నాయి!!!

కిరకిరమన్న శబ్దం విని తుళ్ళిపడి వెనక్కు తిరిగేను.

సమీర మెల్లగా ట్రాలీ తోసుకుంటూ వచ్చింది.

ట్రేలో తెల్లని గుడ్డ పొందికగా పరచి వుంది.

డికాక్షన్ మగ్గు, పాల జగ్గు, షుగర్‌బౌల్, రెండు వెండి చెంచాలు, రెండు కప్పులు, సాసర్లు దానిమీద అందంగా పేర్చి వున్నాయి.

కాఫీకి ఇంత అట్టహాసమూ జరగాలి!

కాఫీ సర్వింగే కాదు – అన్నీ ఇలాగే జరగాలి!

నిజానికి ఈ పనులు రోజూ వంట మనిషి చేస్తుంది.

ఆదివారం మాత్రం వంట మనిషిని ఇంటి దరిదాపులలోనికి రానివ్వదు సమీర!

అంతా తానే స్వయంగా చేస్తుంది.




కాఫీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్... అన్నీ తానే స్వయంగా తమ ఇద్దరికీ తయారుచేస్తుంది.

డికాక్షన్, పాలు కప్పులోనికి వంపి తరువాత పంచదార కలుపుతోంది సుతారంగా.

''నాకు స్ట్రాంగ్ కాఫీ కావాలి'' అన్నాను.

రెండు క్షణాలు పాటు తియ్యగా నా కళ్ళల్లోకి చూసింది.

''డాక్టర్ వైద్యనాధ్‌గారు ఏం చెప్పారో గుర్తుందా?'' అడిగింది.

''గుర్తు లేదు'' అన్నాను బింకంగా

''పూర్తిగా కాఫీ మానేసి కాంప్లాన్ తాగమన్నారు. పోనీకదా... అబ్బాయి గారు బాధపడి పోతున్నారని... ఒకపూట కాఫీ శాంక్షన్ చేశాను... అది ఎంత లైట్‌గా తాగితే అంత మంచిది... మారాం చేయకుండా తాగెయ్యండి...''

మూతి సున్నాలా చుట్టి, ఆపేక్షనంతటినీ కళ్ళలోకి తీసుకువచ్చి, బుగ్గమీద చిన్నగా ముద్దు పెట్టుకుంటూ కాఫీ కప్పు నాకు అందించింది.

అంతలోనే కిటికీ వంకకు తిరిగి–

తెరిచివున్న లెనీషియల్ బ్లయిండ్స్ వంక చూసి–

''ఎందుకు తెరిచేరు? గదిలో దుమ్ము పడిపోతుంది...''

అంటూ కిటికీ దగ్గరకు వెళ్ళి రోప్‌లాగి వాటిని మూసేసింది.

పై అధికారి ఆజ్ఞలకు తు.చ. తప్పకుండా పాటించే నమ్రగత గల ఉద్యోగుల్లా.

లీవ్స్ టపటపమని ముడుచుకుపోయి గదిని చీకటిగా చేశాయి.

గదిలో ట్యూబ్‌లైట్ వెలిగించింది సమీర.

ఆమెతో వచ్చిన చిక్కే ఇది!

గది కిటికీ తలుపులు తెరవనివ్వదు!

దూరంగా వున్న రోడ్డుమీది ధూళి ఎగిరివచ్చి, గదిలో పడుతుందంటుంది. ఆ ధూళి కల్గిన గాలి పీలిస్తే వచ్చే అనర్థాలు ఆమె కంఠస్థం చేసినట్లు చెప్పగలదు.

కానీ – నిజానికి కారణం అది కాదు.

కిటికీ తలుపులు మూసివేయటానికి కారణం వేరే వుంది.

ఏదో అనాలని అనుకున్నాను.

కానీ, మళ్ళీ వెంటనే ఆ ఆలోచన విరమించుకున్నాను.

పాల రుచితో వున్న కాఫీ అసంతృప్తిగా తాగి –

ఆ అసంతృప్తిని ముఖంలో కనబడనీయకుండా జాగ్రత్తపడుతూ – కప్పు ట్రేలో వుంచేను.

తన కప్పు కూడా ట్రేలో పెడుతూ సమీర అడిగింది.

''కాఫీ ఎలా వుంది?''

'నా ముఖంలా వుంది' అనబోయాను.

కానీ అనలేదు! వెర్రి నవ్వొకటి ముఖానికి పులుముకుంటూ

''నువ్వు తయారుచేసిన కాఫీ బాగుండకపోవటమేమిటి? డికాక్షన్ లేకపోతేనేం? దాన్నిండా నీ ప్రేమ నిండి వుంది? నీ ప్రేమకంటే డికాక్షన్ గొప్పది కాదు!'' అన్నాను. చాలా సిన్సియర్‌గా ముఖం పెట్టి.

సమీర ఆనందంగా మంచంమీద నుండి లేచి అల్మారా దగ్గరకు వెళ్ళి త్రిబుల్ ఫైవ్ సిగరెట్ పేకెట్ అందుకుంది.

అందులోంచి ఒకటి తీసి నా పెదాలు మధ్య వుంచింది.

లైటర్ సహాయంతో తానే స్వయంగా అంటించింది.

తృప్తిగా రెండు పీల్పులు పీల్చేను.

నరనరాల్లో కొత్త ఉత్సాహం నిండినట్లయింది.

''మళ్ళీ లంచ్ తర్వాతే సిగరెట్టు. అంతవరకూ అడగవద్దు!'' అంది.

''అలాగే''

''సిగరెట్టు సగం దాకా కాల్చి పారెయ్యండి''.

''అలాగే''

''ఫిల్టరు దాకా కాలిస్తే పెదాలు నల్లగా కమిలిపోతున్నాయి''.

''ఎక్కడిదాకా కాల్చాలో దీనిమీద పెన్సిలుతో గీత గియ్యి'' అన్నాను నవ్వుతూ.

ఆ నవ్వుతో బాటు మిళితమయిన వ్యంగ్యాన్ని అర్థం చేసుకుంది.

"అదిగో అబ్బాయిగారికి కోపం వచ్చేస్తోంది"

"కోపం కాదు.."

"సిగరెట్టు ఊపిరితిత్తులకు మంచిదికాదు. మీరు కాల్చే ప్రతి సిగరెట్టు మీ జీవిత కాలాన్ని ఒక గంట తగ్గించేస్తోందన్న నిజాన్ని నేను భరించలేను బాబూ!"

"ప్రతి నిమిషమూ నువ్వు నన్ను ఇలా శాసించటం నేను కూడా భరించ లేను" అందామనుకున్నాను. కానీ అనలేదు!'

సమీర తనమాట నెగ్గాలనుకున్నప్పుడు చాలా తియ్యగా మాట్లాడుతుంది.

ఆ సమయంలో ఆమె గొంతులో ధ్వనే మారిపోతుంది.

మాట పూర్తయ్యాక నా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తుంది.

ఆ చూపులు మరి నన్ను మాట్లాడనివ్వవు!

ఆ కంఠస్వరంలో ఏదో మత్తు వుంది.

అది నన్ను ట్రాన్స్‌లో పడేస్తుంది!

"సమీరా! ఈ వేళ యార్డులోకి మెషినరీ వస్తుంది. అన్‌లోడ్ చేయించే సమయంలో నేనుంటే మంచిది. పన్నెండు లక్షల రూపాయల సరకు! అందుకని. పది గంటలకు 'కాంటెస్సా' తీసుకుని యార్డ్‌కు వెళతాను. నువ్వు బయటకు వెళ్ళాలంటే ఫియట్ వాడుకో!"

సమీర నా మాటలు విని బుంగమూతి పెట్టేసింది.

"ఆఫీసు గొడవలు రోజూ వుండేవే గదా! ఈ ఒక్క రోజుకీ మరిచిపోలేరా? మీరు వెళ్ళక పోతే అన్‌లోడింగు ఆగిపోదులెండి. ప్రాజెక్టు మేనేజరు నాలుగు వేల జీతం ఎందుకు తీసుకుంటున్నాడు? అన్నిటికీ మీరే వెళ్ళాలంటే మరి అతడిని ఎందుకు ఎపాయింట్ చేసినట్టు? నోనో!" అంది.

"అదికాదు సమీరా..."

"నో! నో! సన్ డే ఈజ్ సన్ డే! దట్సాల్! పూర్తిగా ఈ రోజు అంతా మనిద్దరం కలిసి గడప వలసిందే... ప్లీజ్!"

అది అభ్యర్థన కాదు – ఆర్డరు!

దానికి తిరుగులేదు మరి!

సమీర బ్రతిమిలాడుతున్నట్లే శాసిస్తుంది.

నేను దీర్ఘంగా నిట్టూర్పు వదిలేను.

అంతలోనే సమీర ఫోన్ దగ్గరకు వెళ్ళి రిసీవరు ఎత్తి డయల్ చేసింది.

"హలో! విశ్వనాథంగారా?.... ఆ! సమీరా స్పీకింగ్... గుడ్ మార్నింగ్... ఈ వేళ మెషినరీ వస్తోందిట కదా.. ఊ... అదే... ఆయనకి ఒంట్లో కాస్త నలతగా వుంది.... శ్రమ అనుకోకుండా మిమ్మల్ని యార్డ్‌కు వెళ్ళి అన్‌లోడ్ చేయించమన్నారు... అబ్బే... పెద్ద నలత కాదు... కాస్త వీక్‌నెస్.... నో నో... నో... అయ్‌విల్ టేక్ కేరాఫ్.... థాంక్యూ... వుంటాను..." రిసీవరు క్రెడిల్ చేస్తూ అంది.

"ముసలాయన డాక్టర్ని తీసుకు వస్తానన్నాడు. వద్దని చెప్పేను".

"పాపం ఆయనకు అర్జెంటు పనేదో వుందన్నాడు. అనవసరంగా ఆయన్ని ఇరుకులో పెట్టేవు" నొచ్చుకుంటున్నట్లు, సమీర వంక చూస్తూ అన్నాను.

"ఫరవాలేదులెండి... ఆ! బై ది బై! లంచ్‌లోకి ఏం చేయమంటారు?" అంది మాట మారుస్తూ.

"బంగాళ దుంపల వేపుడు, కొబ్బరి చట్నీ చాలు".

"వేపుళ్ళువద్దు... ప్లీజ్.. అయినా బంగాళాదుంపలో ఏముంది? అంతా కార్బోహైడ్రేట్లే కదా... పచ్చిబఠాణీ ఉడకబెట్టి కూర చేస్తాను. మంచి ప్రొటీను డైట్ అది... కొబ్బరి తింటే దద్దుర్లు వస్తాయేమో మీకు... అసలే పైత్యపు శరీరం... టొమాటా పచ్చడి చేస్తాను..." అంది సమీర.

"ఆ మాత్రం దానికి మరి నన్ను అడగటమెందుకు? నీ ఇష్టం వచ్చినవే చేయచ్చును కదా!" అందామనుకున్నాను కానీ అనలేదు.

"నీ ఇష్టం"

చేతిలోని సిగరెట్ యాష్ ట్రేలో పడేశాను.

కాఫీ కప్పులు ట్రేలో వుంచి, ట్రేని ట్రాలీలో సర్ది మెల్లగా దాన్ని తోసుకుంటూ బయటకి వెళ్ళిపోయింది సమీర.

దీర్ఘంగా నిట్టూర్పు వదిలి, ఆ వేళ్టి పేపరు అందుకుని, సోఫాలో చేరగిలబడ్డాను.

సమీరకూ, నాకు వివాహమయి మూడు సంవత్సరాలయింది.

కాదు! సమీర నన్ను వివాహం చేసుకుని మూడు సంవత్సరాలయింది!!

ఆగర్భ శ్రీమంతుల లోగిలిలో పుట్టింది ఆమె.

లక్ష్మీదేవిని మోసుకు వచ్చింది.

నేనేమో మధ్య తరగతివాడిని!

ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ కెప్టెన్‌గా విశాఖపట్నంలో మేచ్ ఆడి, సెంచరీ సాధించిన రోజున సమీరతో నాకు పరిచయమయింది.

నా గురించిన వివరాలు అడగటం–

నన్ను తాను వివాహం చేసుకోవటం–

అన్నీ కలలో విషయాలకు మల్లే, రెండు నెలల్లో జరిగిపోయాయి. ఆ తర్వాత మరి నేను క్రికెట్ ముట్టుకోలేదు!

అది వేరే సంగతి!

పెళ్ళయిన నాలుగు నెలలకు నా ఎం.బి.ఏ. పూర్తయింది.

సమీరా ఫాబ్రికేషన్స్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రయినీగా చేరి, చేరిన సంవత్సరానికే ట్రయినింగు అయిందనిపించేను.

తర్వాత సంవత్సరంలో సమీర తండ్రి చనిపోవటం...

సమీర మొత్తం ఆస్తి అంతటికి తిరుగులేని వారసురాలు కావటం, నేను ఆ కంపెనీకి జనరల్ మేనేజరు నయిపోవటం–

వారాలు తేడాలో జరిగిపోయాయి.

నా తరపున ఉన్న ఏకైక ఆస్తి నాన్న!

అమ్మ చనిపోయిన తరువాత, మతిభ్రమించి, వెర్రిమొర్రిగా మాట్లాడుతూ కాలం నెట్టుకొస్తున్న నాన్న!!

ఆయనకు డెబ్బయి సంవత్సరాలు నిండి పోయాయి.

మా పెళ్ళయిన కొత్తల్లోనే ఆయనను మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించేం.

నాన్న మాతోబాటు వుండడం సమీరకు అంతగా ఇష్టంలేదని గ్రహించగలిగేను. అందుకే ఆమె ఆయనను మెంటల్ హాస్పిటల్లో చేర్పిస్తున్నప్పుడు అడ్డ పెట్టలేకపోయాను.

అక్కడ ప్రత్యేకంగా సపర్యలు జరుగుతాయనీ, డాక్టర్లు నిత్యమూ పరీక్షిస్తూ వుంటారనీ, మా దగ్గరకంటే అక్కడే ఆయనకు సుఖం దొరుకుతుందనీ నాకు నేను సర్ది చెప్పుకున్నాను.

ప్రతి ఆదివారం రోజున ఒకసారి ఆయనను పలకరించి రావటం పరిపాటి.

సమీర కూడా వారానికి రెండు మూడుసార్లు వెళ్ళి ఆయనను పలకరించి, తర్వాత డాక్టర్లతో మాట్లాడి వస్తుంది.

"స్నానం చేసి రండి! గీజర్ ఆన్ చేశాను" అంది గదిలోకి వస్తూ.

"అలాగే".

## కథాంతరంగం



తరాలు మారుతున్నకొద్దీ మనం ప్రకృతికి దూరమయి పోతున్నాం. చుట్టూ వున్న ప్రకృతినీ పర్యావరణాన్ని గమనించకుండా ఇరుకుగదుల్లో బందీలమయి పోతున్నాం. బయట ప్రకృతిలోని వెలుతురు, పిట్టలు, మొక్కలు, క్రిమికీటకాలు, పచ్చిక... ఇలాంటివన్నీ మనిషికీ ప్రకృతి రహస్యాలను చెబుతాయి. వాటిని విస్మరిస్తున్నాం. జీవితాలను కనీసం కిటికీలు కూడా లేని ఇరుకు గదులుగా మార్చేసుకుంటున్నాం. మన మనోగవాక్షాలను తెరిచి పొందే అలౌకికానందంతో ఏదీ సాటిరాదు. కీర్తిశేషులు, సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావుని కలిసినప్పుడల్లా ఈ కథ గురించి ముచ్చటించకుండా వదిలేవారు కాదు.


**– ద్విభాష్యం రాజేశ్వరరావు**

*49-27-33/1, కవిత మధురానగర్,*

*విశాఖపట్నం – 530 016*

*ఫోన్: 0891-2790109*

"ఆదివారం కదా, తలకు షాంపూ పెట్టుకోండి!"

"ఊహు! పెట్టుకోను" అన్నాను మొండిగా.

"ఎందుకని?" అతి సహజంగా అడిగింది.

'అంతే! అది నా ఇష్టం! అది నా తల! నా ఇష్టం వచ్చినట్లు రుద్దుకుంటాను. నువ్వు షాంపూ రాసుకొమ్మంటే రాసుకోవాలని రూలుందా!' అని అరిచి చెప్పాలనుకున్నాను.

నా మనసులోని ఊహలు ఇంకా లోపలి పొరల్లో వుండగానే – నా కళ్ళలోకి చూస్తూ వాటిని పసిగట్టగల శక్తి సమీరకు వుంది!

అదే ఆమె గొప్పతనం!

ఆమె ముఖం వంక చూసి మాట్లాడలేక పోయాను కొంత సేపు.

తర్వాత మెల్లగా "అబ్బ! తల రుద్దుకోలేను బాబూ.... చేతులు నొప్పి..." అన్నాను.

"చూశారా? ఇంతవరకూ నాకు చెప్పనేలేదు! ఇక మీదట మీరు తల రుద్దుకోవద్దు, నేనే స్వయంగా రుద్దుతాను" అంటూ మెత్తగా నా కళ్ళలోకి చూసింది.

పది నిమిషాల తర్వాత....

నా బుర్ర ఆమెకు అప్పగించేను.

తలస్నానం అయిందనిపించేను.

తువ్వాలుతో తల తుడుస్తూ వుంటే అడిగేను.

"మన బాత్‌రూంకు కిటికీ వుంటే బాగుంటుంది కదా!"

"బాత్‌రూంకి కిటికీ లెందుకండీ? మీవి అన్నీ చిత్రమైన ఆలోచనలే – కిటికీలుండ కూడదు..." అంది

"మరి?"

"వెంటిలేటర్లుండాలి!"

"ఏం కిటికీలెందుకు వుండ కూడదు?"

"ఏం ప్రశ్నలు బాబూ అవి? మనం స్నానం చేస్తూ వుంటే అవతలి వాళ్ళ కంట పడదూ?"

"స్నానం చేసే సమయంలో తలుపులు మూసుకుంటాం"

"తలుపులు మూసుకునేపాటికి అవి వున్నా ఒకటే, లేకపోయినా ఒకటే. కిటికీ లెందుకు?" అంది.

"మరి, మన బెడ్‌రూం కిటికీలు ఎప్పుడూ మూసి ఉంచుతావెందుకు?" కసిగా అడిగేను.

నా గొంతులో కాఠిన్యం గుర్తించింది సమీర.


"నేలంతా దుమ్ము కొట్టుకుపోతుంది. బెడ్ పాడయిపోతుంది. బుక్స్ రేక్ నిండా ఎంత దుమ్ము పేరుకుపోతోందో చూడండి!"

"కాదు... అదేం కాదు!"

గట్టిగా అరిచేను.

సమీర నా వంక వింతగా చూసింది.

"మరి... ఎందుకంటారు?.... మీరు అలా అయిపోయారేమిటి?"




ఎంతో అమాయకంగా ముఖం పెట్టి, ఆందోళన కళ్ళల్లో ప్రతిఫలింపజేస్తూ అడిగింది సమీర.

'ఎందుకంటావా?.....

నిజంగా నీకు తెలియకనే ఈ ప్రశ్న అడుగుతున్నావా?....

ఎదురుగా వున్న సముద్రం మీద పరుచుకుంటున్న సుప్రభాత సూర్యకిరణాల అందాలను నేను తిలకిస్తానని...!

నిండు పున్నమినాడు వింత సోయగాలతో కెరటాలపై ప్రతిఫలించే వెన్నెల అందాలను చూస్తూ తన్మయంతో కూర్చుండి పోతానని!

కెరటాలపై గిరికీలు కొడుతూ తిరిగే వింత పక్షి సొగసులు గమనిస్తానని....!

ఇంకా......

ఇంకా.....

బీచ్‌రోడ్డు మీద నడిచిపోయే అందమయిన అమ్మాయిల సౌందర్యాన్ని చూస్తూ మైమరిచి పోతానని...!

దూరంగా, అవతల మేడమీద సాయంకాలం పూట నడుముకు పెద్ద రింగు తగల్చుకుని వ్యాయామం చేసే బలిష్టమయిన అమ్మాయి ఒంటి ఒంపుసొంపులు వీక్షిస్తానని...!'

ఏదో, ఏదో అరిచి చెప్పాలనుకున్నాను.

చెప్పేసనని కూడా కొంతసేపు అనుకున్నాను.

కానీ, నా నోరు పెగల్లేదు.

నా ముఖంలోని ఆవేశం గమనించింది సమీర.

మెల్లగా దగ్గరకు వచ్చింది.

నుదిటిమీద మెల్లగా రాస్తూ అంది.... "ఎందుకండీ! అలా ఎగ్జయిట్ అవుతారు? మనసులో ఏముందో నాకు చెప్పరూ?......"

తరువాత –

నుదుటిమీద ముంగురులను వెనక్కితోసి ముద్దు పెట్టుకుంది.

అంతే!

నీరు కారిపోయాను నేను!

"అబ్బే! ఏమీ లేదు!" అన్నాను మామూలు ధోరణిలో.

నా తల టర్కిష్ తువ్వాలుతో ఒత్తుతూ–

"మీరు కిటికీ దగ్గర నిలబడితే అందరి కళ్ళు మీమీదే! కారులో మనం వెళ్ళుతూ వుంటే అందరి చూపులు మీపైనే! అది నేను భరించలేను బాబూ... మీకు దిష్టి తగులుతుందని" అని మాటలు ఆపి ఒక్క క్షణం నా కళ్ళల్లోకి చూస్తూ.

"అలా అద్దంలో చూసుకోండి. ఎంత అందంగా వున్నారో.... తలంటు పోసుకుంటే... మరీను" అంది.

దీర్ఘంగా నిటూర్పు వదిలేను.

రెండు క్షణాల తర్వాత మెల్లగా అడిగేను.

"సమీరా! అద్దంలో కన్పించేది నేనేనా?"

నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

కొంతసేపు అయోమయంగా నా వంక చూసింది.

"నేను కాదు.. నా నీడ!" అన్నాను.

తర్వాత మనసులో అనుకున్నాను.

'నన్నుచూడటం నీకు సాధ్యం కాదు సమీరా... నన్ను చూడాలంటే నువ్వు చూడాల్సింది అద్దం పొరల్లోకి... నా మనసు కిటికీలు తెరిచి చూడాలి.... అప్పుడు నాలో వున్న నేను నీకు కన్పిస్తాను!'

"ఒక్కో సమయంలో మీ మాటలు నాకు అర్థం కావు బాబూ – పదండి. వెళ్ళి మావయ్య గారిని చూసిరావాలి. డ్రెస్ వేసుకోండి. ఇద్దరం హాస్పిటల్‌కు వెళ్దాం" అంది సమీర.

మౌనంగా నా గదివైపు నడిచేను.

అరగంట తర్వాత–

నేను 'కంటెస్సా'లో వున్నాను.

స్టీరింగ్ దగ్గర సమీర కూర్చుంది.

ఇంజన్ స్టార్ట్ చేసి బ్లాక్ మిర్రర్ క్లోజ్ చేసింది.

ఏ.సి. ఆన్ చేసింది.

కారు ముందుకు కదిలింది.

చల్లనిగాలి నన్ను కమ్మేసింది. సమీర మమతలాగే!

కారు రోడ్డుమీద దూసుకుని ముందకు సాగిపోతూ వుంటే – నేను సీటులో వెనక్కు వాలేను.

పావు గంట తర్వాత కారు మెంటల్ హాస్పిటల్ ఆవరణలో ఆగింది.

డోర్ తెరిచి దిగుతూ అంది సమీర "నేను డాక్టర్ గారి దగ్గరకు వెళ్ళి ఈ నెల బిల్లు సెటిల్ చేసి వస్తాను. మీరు వెళ్ళి మావయ్యగారి దగ్గర కూర్చోండి".

"అలాగే".

తల పంకిస్తూ కారు దిగేను.

హాస్పిటల్ వరండా దాటి గదులవైపుకు నడిచేను.

దారిలో పలకరింపుగా విష్ చేస్తున్న నర్సుల వంక చిరునవ్వు చిందిస్తూ నాన్న రూము దగ్గరకు వెళ్ళేను.

నేను వెళ్ళేసరికి నాన్న మంచం మీద మఠం వేసుకుని కూర్చుని వున్నారు.

ఖాళీగా వున్న కుర్చీని మంచం దగ్గరకు లాక్కున్నాను. దానిలో కూల బడుతూ "మీ ఒంట్లో ఎలా వుంది నాన్నా?" అని అడిగేను.

"చాలా బాగుందిరా బాబూ...." అంటూ నవ్వేరాయన.

రెండు నిమిషాల మౌనం తర్వాత మళ్ళీ అన్నారు.

"ఈ వేళ చాలా ఆనందంగా వుందిరా అబ్బాయ్!"

తర్వాత అదే పనిగా రెండు మూడు నిమిషాల పాటున నవ్వేరు.

"ఏమిటి నాన్నా, అంత ఆనందం? నాతో కూడా చెప్పండి!"

ఈ వేళ నాన్నలో ఎంతో మార్పు కనిపిస్తోంది.

అసలు, ఆయన్ని మామూలుగా బయటచూస్తే ఆయనకి మతి భ్రమించిం దని ఎవ్వరూ అనుకోరు... నాకే అనుమానం వస్తూ వుంటుంది అప్పుడప్పుడు... అనవసరంగా ఈ జైలులో ఆయన్ని బంధించానేమోనని...!

అయినా, చేయగలిగింది ఏమీ లేదు!

"నా పక్క గదిలో చలపతి వుండేవాడు, గుర్తుందా?"

అడిగారు నాన్న.

"ఎందుకు గుర్తులేదు?.... మీ స్నేహితుడు కదా!.... మీరెప్పుడూ ఆయన తోటే కబుర్లు చెప్తూ వుంటారు కదా... ఆయన్ని ట్రీట్‌మెంట్ పూర్తిచేసి పంపే శారా?"

"ఆ! ట్రీట్‌మెంట్ పూర్తయిపోయింది".

మాటలు ఆపి మళ్ళీ నవ్వటం ఆరంభించేరు.

నా మనసు కీడును శంకించింది.

"ఆయనకు ఏమయింది?" అడిగేను.

"ట్రీట్‌మెంట్ పూర్తిచేసి ఏకంగా పైకి పంపించేశారు... ఈవేళ నాకు చాలా సంతోషంగా వుందనుకో... పొద్దుట ఎనిమిదింటికి వాళ్ళబ్బాయి వచ్చి అతడి శవాన్ని తీసుకు పోయాడు..."

అంటూ మళ్ళీ నవ్వేరు.

"నాన్నా!" అంటూ రెండు క్షణాలు పాటు ఏం మాట్లాడాలో తోచక అలాగే వుండి పోయాను.

"ఆయన చనిపోతే.... మీరు ఆనందిస్తున్నారా?" అన్నాను కొంత సేపు పోయాక.

"ఎంతో కాలం నుండీ ఆ గది కావాలని అడుగుతున్నారా! ఖాళీ అయితే ఇస్తామన్నారు! ఈ వేళ్టికి నా కోరిక నెరవేరింది. ఈ సాయంకాలమే ఆ గదిలోకి మార్చేస్తారు నన్ను!" అన్నారాయన మరింత ఉత్సాహంతో.

నా ప్రశ్నను అసలు పట్టించుకోలేదు ఆయన.

"ఈ గది మీకు బాగులేదా? అసలు మారిపోవటమెందుకు?" అన్నాను నోరు పెగుల్చుకుంటూ.

"ఆ గది ఆఖరి గది కదా..." అన్నారు.

"అయితే?"

"కిటికీ వుంది..."

అప్పుడు గమనించేను నేను!

నాన్న ఉన్న గదికి ఎత్తులో వెంటిలేటర్లు తప్ప కిటికీలు లేవు!

నాన్న చెప్పుకుపోతున్నారు.

".....ఆ కిటికీ దగ్గర కూర్చుని బయటకు చూస్తూ నా చివరి రోజులు హాయిగా గడిపేస్తానురా అబ్బాయ్!.... మనం ప్రకృతి మాత ఒడిలో నుండి వచ్చేం... ప్రకృతిలోనే కలిసిపోవాలి... ప్రకృతికీ మనకు అడ్డుతెర గోడ! గోడ కున్న కొద్దిపాటి మేర తెర తొలగించి, అవతలి అందాలను చూపించేది కిటికీ! అందుకే కిటికీ వున్న గది అంటే నాకెంతో ఇష్టం! అంతకంటే నాకు ఏ కోరికా లేదురా అబ్బాయ్!"

ఎంతో ఆనందంగా విన్పిస్తోంది ఆయన గొంతు!

"ప్రస్తుతం నేను జీవిస్తున్న బంగళాలో గది – నాన్న కోరుకుంటున్న మెంటల్ హాస్పిటల్ లోని ఆఖరి గదికంటె గొప్పదా?"

ఆలోచిస్తున్నాను!!!

★

**(1981లో ఆంధ్రప్రభ వీక్లీలో ప్రచురితం)**

## యాంత్రిక జీవనం

కవిత

ఇపుడు వ్యక్తి సమాజంతో కుస్తీ పడుతున్నాడు
విరిగిన ఎముకలకు కట్లు కడుతున్నాడు
శరీరం బలహీనమై పోతుంది
మానసిక అశాంతి అభద్రతకు దారి తీస్తుంది
అనూహ్య పరిణామాల మధ్య
అమాయకుల ప్రాణాలు బలి అవుతున్నాయి
ఆశ్రయం కోసం పోరాటం సలుపుతూనే
ఆర్తికోసం చేతులు చాపుతూ
అహరహం ఫలితానికై ప్రయత్నం



నిశ్శబ్దం లేనేలేదిప్పుడు
అంబులెన్స్ నిద్రించే రాత్రులెన్ని
ఆందోళనలో కునుకు పట్టిన క్షణమే సూర్యోదయం
విద్యుత్ సరఫరాలో అంతరాయం
తాగునీటి సరఫరా ఈ రోజు లేదు
రాష్ట్ర వ్యాప్త బంద్ ప్రకటించబడింది
బస్సులు ధ్వంసమౌతున్నాయి
ఆఫీసులు, కళాశాలలు, పాఠశాలలు వెలవెల బోతున్నాయి
ప్రధాన కూడళ్ళలో రాజకీయ చర్చలు

సంక్షోభంలో రాజ్యపాలన
బల నిరూపణ సయోధ్యకై తండ్లాట
ఆధునికీకరణలో ఆకర్షణీయ సాంకేతికాలు
అభివృద్ధికి సంకేతాలు
సాంకేతిక పరిభాషలో జ్ఞానవంతులు
ఉనికిని కోల్పోతున్న జీవన ఆధారాలు
కొత్త పంథా..
ఆత్మీయంగా ఎవరినైనా పలకరిస్తుందా
యాంత్రికంగా ఎన్నాళ్ళని బతకాలి
అంతా ఓ మ్యాజిక్ .. మ్యాజిక్

**– మరింగంటి శ్రీకాంత్**